క్లుప్తంగా

ఈ క్రాప్ నమోదు చేసుకోవాలి

చిత్తూరు రూరల్: చిత్తూరు డివిజన్‌లోని రైతులు ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని వ్యవసాయ శాఖ ఏడీ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ఈ క్రాప్ నమోదు చేసుకోవచ్చన్నారు. ఇందుకు రైతు ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంకు పాపు పుస్తకం జిరాక్స్ కాపీలు ఇవ్వాల్సి ఉందన్నారు. పంట నమోదు చేయించుకున్న రైతులకు పరిహారం, రాయితీలు, ఎరువులు, విత్తనాలు, రైతు భరోసాకు అర్హులన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ సేవలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పూర్ణలత

ఐరాల: మండలంలోని నాగంవాండ్లపల్లెలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి పూర్ణలత 104 వైద్య శిబిరంలో 80 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యా సూత్రాలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ అరుణ, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఇంటికే పౌష్టికాహారం



కిట్‌ను అందజేస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ రమ్య

గుడిపాల: గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత, పోషకాల లోప నివారణకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఇంటికే పౌష్టికాహారం అందిస్తున్నట్లు జెడ్పీవైస్ చైర్మన్ రమ్య అన్నారు. కిల్లారిపల్లె అంగన్‌వాడీ సెంటర్‌లో గురువారం టేక్‌హోమ్ రేషన్ (ఇంటికే పౌష్టికాహారం కిట్) పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు కిట్లను అందజేశారు. అనంతరం నులిపురుగుల మాత్రలను అంగన్‌వాడీలోని పిల్లలకు తినిపించారు. అంగన్‌వాడీ కార్యకర్త రాణి పాల్గొన్నారు.

సర్పంచులకు న్యాయం చేయాలి

చిత్తూరు కలెక్టరేట్ : సర్పంచ్‌లకు న్యాయం చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు సురేష్‌రెడ్డి అన్నారు. కలెక్టరేట్ ఎదుట బీజేపీ, జనసేన పార్టీల నాయకులు గురువారం ధర్నా చేశారు. అనంతరం డిమాండ్లను పరిష్కరించాలని కలెక్టరేట్ ఏవో కులశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో సురేష్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామ నిధుల చెక్ పవర్ సర్పంచ్‌లకు ఇవ్వాలన్నారు. ధర్నాలో ఆ పార్టీల నాయకులు చిట్టిబాబు, యుగంధర్, షణ్ముగం పలువురు పాల్గొన్నారు.

సీఏ ఫలితాల్లో ఆర్‌కే ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ బద్రినారాయణ, ప్రిన్సిపల్ రమేష్‌బాబు

చిత్తూరు కలెక్టరేట్ : సీఏ ఫౌండేషన్ ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారని ఆర్‌కే విద్యాలయ కళాశాల కరస్పాండెంట్ బద్రినారాయణ, ప్రిన్సిపల్ రమేష్‌బాబు తెలిపారు. మిట్టూరులో ఉన్న ఆ కళాశాలలో గురువారం ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ తమ కళాశాలలో చదివిన విద్యార్థులు 400 మార్కులకు గాను విష్ణు 320 మార్కులు, హర్షిత 254, శ్రావ్య 241, ఉదయశ్రీ 209, లీలా ప్రసాద్ 202 మార్కులు సాధించారని చెప్పారు. అనంతరం ఆ విద్యార్థులను అభినందించారు.

శ్రీవారి సేవలో..



చిత్తూరు కార్పొరేషన్ : తిరుమల శ్రీవారిని గురువారం మంత్రి ఆర్.కే. రోజా, చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలి

తవణంపల్లె: విద్యార్థుల చదువుల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని తవణంపల్లె హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు శ్రీరంజని సూచించారు. హైస్కూల్లో గురువారం విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. హెచ్‌ఎం శ్రీరంజని మాట్లాడుతూ ప్రతి రోజు సక్రమంగా పిల్లలను బడికి పంపాలని సూచించారు. కొంత మంది పిల్లలు ఇంటి దగ్గర హోంవర్క్ చేయని కారణంగా బడికి నిలిచిపోతున్నారని చెప్పారు. బోధనలో ఎలాంటి సందేహాలున్నా ఉపాధ్యాయుల వద్దకు నివృత్తి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇంటింటికీ వైద్యం..

పల్లెకు ఔషధం



ద్వారకాపురంలో సుందరంగా రూపుదిద్దుకున్న వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం

ప్రభుత్వం వైద్యానికి పెద్దపీట వేస్తోంది. ఖర్చును లెక్కచేయకుండా కోట్లాది రూపాయల నిధులను కేటాయిస్తోంది. పల్లె పల్లెనా వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేస్తోంది. ఫ్యామిలీ ఫిజీషియన్ విధానానికి శ్రీకారం చుట్టింది. అవసరమైన వైద్యులను నియమించింది. ప్రజల వద్దకే ప్రభుత్వ వైద్యం అందుతుంటే, పల్లెకు ఔషధంగా మారింది.

- వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ఏర్పాటు
- ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు అమోఘం
- హర్షిస్తున్న ప్రజానీకం

తవణంపల్లె: మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం ఉంది. జనాభా నిష్పత్తి ప్రకారం గాజులపల్లెలో నూతన ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం మంజూరు చేసింది, ఇద్దరు వైద్యాధికారులను నియమించింది. త్వరలో నూతన పీహెచ్‌సీని ప్రారంభించనున్నారు. గతంలో మండలంలో 11 ఉప కేంద్రాలు ఉండేవి. ప్రస్తుతం మండలంలోని 32 పంచాయతీల్లో 16 వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్లను ఏర్పాటు చేశారు. మండలంలో వైఎస్సార్ విలేజ్ క్లినిక్ సెంటర్లకు ఐదు భవనాలు ఉండగా ప్రభుత్వం 11 హెల్త్ క్లినిక్ భవనాలు నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. జొన్నగురకల, ద్వారకాపురంలో వైఎస్సార్ హెల్త్ విలేజ్ క్లినిక్ భవనాలను సుందరంగా తీర్చిదిద్ది ప్రారంభానికి ముస్తాబు చేశారు. మిగిలిన భవనాల పనులు వివిధ దశల్లో ఉన్నాయి. పల్లెచెరువు, ఎగువ తవణంపల్లె సచివాలయాల పరిధిలోని భవనాలు నిర్మాణానికి స్థలం విషయంలో కోర్టులో కేసులు నడుస్తున్నవి.

67 రకాల వైద్య సేవలు

మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గ్రామీణ ప్రజలకు 67 రకాల జబ్బులకు వైద్య పరీక్షలు చేయించి వైద్య సేవలందిస్తున్నారు. అదే విధంగా 104, 108 వాహనాలు మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ అత్యవసర వైద్య సేవలందిస్తున్నాయి. దీంతోపాటు మాతా శిశు సంక్షేమ కార్యక్రమాలు, జాతీయ వైద్య మిషన్, సంక్రమం-అనుసంక్రమిక వ్యాధుల పర్యవేక్షణ, ప్రధానమంత్రి స్వస్థ మాతృత్వ అభియాన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

మండలంలో వైద్య సిబ్బంది వివరాలు

వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు	16
ప్రాథమిక ఆరోగ్య కేంద్రం	01
వైద్యాధికారులు	04
స్టాఫ్ నర్సులు	03
సీహెచ్‌ఓ	01
పీహెచ్‌ఎన్‌లు	01
ఆరోగ్య పర్యవేక్షకులు	04 మంది
ఆరోగ్య కార్యకర్తలు	19 మంది
ఎంఎల్‌హెచ్‌పీలు	14 మంది
ఆశా కార్యకర్తలు	55 మంది
ల్యాబ్ టెక్నీషియన్	01
ఫార్మాసిస్టు	01
ఎఫ్ఎన్‌ఓ	01
అటెండర్	01

ప్రజలకు అన్ని రకాల వైద్య సేవలందిస్తున్నాం



పీహెచ్‌సీలో 67 రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నాం. పాము కాటుకు, కుక్క కాటుకు మందులు సిద్ధంగా ఉన్నాయి. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ద్వారా ఉచితంగా పేదలకు ఇంటి వద్దకే వెళ్లి వైద్య సేవలందిస్తున్నాం.
– డాక్టర్ దాత్రేయచౌదరి, వైద్యాధికారి, తవణంపల్లె

అన్నిరకాల వైద్య సేవలు



డాక్టర్లు, వైద్య సిబ్బంది మా ఊర్లోకే కాదు. ఇంటి దగ్గరకు వచ్చి అన్ని రకాల జబ్బులకు చికిత్సలు చేస్తున్నారు. ఉచితంగా పరీక్షలు చేయించి మందులు ఇస్తున్నారు. వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా మంచి వైద్యం అందుతున్నది.
– లక్ష్మమ్మ, ద్వారకాపురం

డాక్టర్లు వస్తున్నారు



గతంలో వైద్యం కోసం తవణంపల్లెకు వెళ్లేవాళ్లం. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పల్లె ప్రజలకు అందుబాటులో డాక్టర్లనే ఇంటికి పంపించడం గొప్ప విషయం. ఇంటి దగ్గరకు వచ్చి డాక్టర్లు వైద్యం అందిస్తున్నారు.
– దామోదర్‌రెడ్డి, సంతపల్లె

మందులన్నీ ఉచితమే



అన్ని రకాల వ్యాధులకు డాక్టర్లు పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇస్తున్నారు. మేము ఎక్కడికీ వెళ్లకుండా ఇంటి దగ్గరకు వచ్చి వైద్యం చేస్తున్నారు. మాకు ఎంతో సౌకర్యంగా ఉంది. ఆరోగ్యంగా ఉన్నాము.
– శాంతమ్మ, దిగువ మారేడుపల్లె

భారతదేశాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలి





తిమ్మోజుపల్లె: ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, పూతలపట్టు: ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, గ్రామస్తులు

బంగారుపాళెం: భారతదేశాన్ని ప్రతి పౌరుడు గౌరవించాలని ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని తగ్గువారిపల్లె, తిమ్మోజుపల్లె, మహాసముద్రం, పాలేరు, చీకూరుపల్లె, కూర్మాయిపల్లె, సంక్రాంతిపల్లె, మంగళపల్లె గ్రామ పంచాయతీల్లో నాభూమి-నాదేశం, నేల తల్లికి వందనం, వీరులకు వందనం క్యాక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ, భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామ పంచాయతీలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని నా భూమి-నా దేశం శిలాఫలకాన్ని ఆవిషరించారు. నా భూమి-నా దేశం ప్రతిజ్ఞ చేశారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో సర్పంచులు వాణిప్రియ, రేఖ, షర్మిల రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, అమరావతి, హేమలత, రమేష్, మురళి, మాజీ సర్పంచులు ప్రకాష్‌రెడ్డి, శరత్‌రెడ్డి, పలువురు నాయకులు, గ్రామ కార్యదర్శులు, ఉపాధి హామీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శిలాఫలకం ఆవిష్కరణ

పూతలపట్టు: ఉపాధి హామీ పథకం కింద నాభూమి నాదేశం, నేలతల్లికి నమస్కారం వీరులకు వందనం కార్యక్రమాన్ని అధికారులు మండలంలోని తలపులపల్లిలో నిర్వహించారు. అందులోభాగంగా ఎంపీడీఓ గౌరి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. పంచప్రాణ్ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం వసుధకు వందనం కార్యక్రమంలో భాగంగా 75 మొక్కలను నాటారు. సర్పంచ్ సుధారాణి, ఏపీఓ సౌభాగ్యవతి పాల్గొన్నారు.



తవణంపల్లె: శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న అధికారులు

వెంగంపల్లెలో..

తవణంపల్లె: మండలంలోని వెంగంపల్లెలో నా భూమి- నా దేశం కార్యక్రమం నిర్వహించారు. సచివాలయం దగ్గర శిలాఫలకాన్ని ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్, తహసీల్దార్ గుణశేఖర్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం సచివాలయం ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. కార్యక్రమంలో ఏపీఓ లలిత, ఉపాధి సిబ్బంది, సచివాలయ సిబ్బంది, సర్పంచ్, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

నేడు అవగాహన సదస్సు

చిత్తూరు కార్పొరేషన్ : రిజిస్ట్రేషన్ ప్రక్రియపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో నిర్వహించే ఈ సదస్సుకు డాక్యుమెంట్ రైటర్స్, ప్రజలు హాజరవ్వాలని కోరారు.

ఇంటికో ఇంకుడుగుంత

తవణంపల్లె: పథకం కింద జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులు ఇంటి ముందు తప్పనిసరిగా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని హౌసింగ్ డీఈ సుబ్రమణ్యం తెలిపారు. మండల కేంద్రంలోని జగనన్న లేఔట్‌లను ఆయన గురువారం సందర్శించారు. గృహ లబ్ధిదారులతో మాట్లాడి ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఒక్కొక్క ఇంకుడు గుంత ఏర్పాటుకు ప్రభుత్వం రూ.6 వేలు మంజూరు చేస్తుందన్నారు. డీఈతో పాటు హౌసింగ్ ఏఈ శ్రీధర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రసన్న, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఉమామహేశ్వరి, లబ్ధిదారులు పాల్గొన్నారు.



ఇంకుడు గుంతల ఏర్పాటుకు కొలతలు తీసుకుంటున్న హౌసింగ్ అధికారులు

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయురాలికి సన్మానం



పద్మశ్రీ దంపతులను సన్మానిస్తున్న సహచర ఉపాధ్యాయులు

యాదమరి: మండలంలోని పెరుమాళ్ల పెంట ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయురాలు పద్మశ్రీని తోటి ఉపాధ్యాయులు గురువారం ఘనంగా సన్మానించారు. మధ్యాహ్నం పాఠశాల ఆవరణలో ఎంఈఓలు రుక్మిణీ, ప్రసాద్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయురాలి దంపతులకు శాలువ కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. ఆమె గత ఎనిమిదేళ్లుగా పాఠశాలలో ఎంతో మంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం మోహన్, ఉపాధ్యాయులు మదనమోహన్ రెడ్డి, సురేష్, కృష్ణయ్య, స్థానిక సర్పంచ్ రాధ, విద్యాకమిటీ చైర్మన్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అమరజీవుల ఆశయ సాధనకు కృషి



యూటీఎఫ్ పతాకాన్ని ఎగురవేసి మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్‌నాయుడు

ఐరాల: అమరజీవుల ఆశయాల సాధనకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్‌నాయుడు పిలుపునిచ్చారు. స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో గురువారం ఐరాల యూటీఎఫ్ శాఖ ఆధ్వర్యంలో 50వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పతాకాన్ని యూటీఎఫ్ సీనియర్ నాయకులు కృష్ణారెడ్డి, జగన్నాథంనాయుడు ఎగురవేసి, యూటీఎఫ్ గేయాన్ని ఆలపించారు. జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ యూటీఎఫ్ ఉద్యోగ, ఉపాధ్యాయుల హక్కుల కోసం పోరాడుతూనే, పిల్లల విద్యాభివృద్ధికి, విద్యాప్రమాణాలను పెంచడానికి యూటీఎఫ్ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్షుడు మోహన్, ప్రధాన కార్యదర్శి అరుణ్‌కుమార్, జిల్లా కార్యదర్శి ఏకాంబరం, అసోసియేట్ అధ్యక్షుడు సురేష్‌బాబు, కోశాధికారి దేవరాజులు, కార్యదర్శులు ప్రతాప్‌రెడ్డి, షబాన, మీనకుమారి, జనార్దన్, అమ్ములు, కుసుమకుమారి, వెంకటముని, నాగరాజు పాల్గొన్నారు.

ప్రతి బాలిక డిగ్రీ చదువుకోవాలి

యాదమరి: ప్రతి బాలిక డిగ్రీ వరకు చదువుకోవాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపునివ్వడం సంతోషకరమని పీఆర్‌టీయూ జిల్లా మహిళ కార్యదర్శులు హిమబిందు, షహనజ్ తెలిపారు. పీఆర్‌టీయూ ఉపాధ్యాయుల సంఘం నాయకులు గురువారం కాశిరాళ్ల ఉన్నత పాఠశాలలో సమావేశం అయ్యారు. పీఆర్‌టీయూ జిల్లా మహిళ కార్యదర్శులు మాట్లాడుతూ డ్వాక్రా మహిళలకు జీరో వడ్డీ రుణాలు, ప్రతి మండలానికి బాలికల కళాశాల, చైల్డ్ కేర్ సెలవులు వంటివి ప్రవేశపెట్టడం మంచి పరిణామమన్నారు. ఉపాధ్యాయులు స్వర్ణలత, కాంచన, త్రివేణి, సుగుణ, రేఖావాణి, సుశీల, కనకాచ్చారి పాల్గొన్నారు.

ఏకీకృత సమస్య పరిష్కరించాలి



చిత్తూరు కలెక్టరేట్ : ఏకీకృత సర్వీస్ రూల్స్ సమస్య పరిష్కరించాలని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కోరినట్లు ఆపస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రావణ్ కుమార్, బాలాజీ తెలిపారు. వారు గురువారం విలేకరులతో మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఏకీకృత సర్వీస్ రూల్స్ సమస్య పరిష్కారం కోసం కేంద్ర విద్యాశాఖ మంత్రిని కలిసి వినతి పత్రం ఇచ్చినట్లు చెప్పారు.

అట్టహాసంగా దుర్యోధన వధ



కాశిరాళ్ల గ్రామంలో ప్రదర్శించిన దుర్యోధన వధ నాటకంలో సన్నివేశం

యాదమరి: మండలంలోని కాశిరాళ్లలో వెలసిన ద్రౌపదీ ధర్మరాజుల ఆలయం వద్ద దుర్యోధన వధ ఘట్టాన్ని నిర్వాహకులు అట్టహాసంగా నిర్వహించారు. మహాభారత యజ్ఞంలో భాగంగా గురువారం ఉదయం ఆలయంలో వెలసిన ద్రౌపదీ ధర్మరాజులకు ప్రత్యేక అభిషేకాలు అలంకరణలు నిర్వహించి పూజలు చేశారు. అనంతరం ఆలయం వద్ద మట్టితో దుర్యోధన రూపాన్ని ఏర్పాటు చేశారు. అచ్చట ద్రౌపదీ, పాండవులు విగ్రహాలను కొలువుదీర్చి పూజలు చేసి దుర్యోధన ఘట్టాన్ని ప్రారంభించారు. దుర్యోధనుడు, భీముని వేషధారులు కీర్తనలు ఆలపిస్తూ ఘట్టం ముగించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్ల దాఖలు ప్రక్రియ

బంగారుపాళెం: మండలంలో వార్డు సభ్యుల ఉప ఎన్నికలకు నామినేషన్ల చివరి రోజు గురువారం నాలుగు నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారి నాగేశ్వర్‌రావు తెలిపారు. మండలంలోని నల్లంగాడు పంచాయతీలో 2వ వార్డుకు ఒక నామినేషన్, సదకుప్పం పంచాయతీలోని 4వ వార్డుకు రెండు, మొగిలివారిపల్లె పంచాయతీలోని 2వ వార్డుకు ఒక నామినేషన్ దాఖలైనట్లు తెలిపారు. శుక్రవారం నామినేషన్ల పరిశీలన చేయనున్నట్లు తెలిపారు.

తేనేపల్లి వార్డుకు ఒకటి

పూతలపట్టు: మండలంలోని తేనేపల్లి ఒకటో వార్డు మెంబరు స్థానానికి 1 నామినేషన్ దాఖలైనట్లు పంచాయతీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి జి.చంద్రశేఖర్ తెలిపారు. తేనేపల్లె 1వవార్డు మెంబరు పి.బాబురెడ్డి మృతి చెందడంతో ఆ స్థానం ఖాళీ అయింది. తేనేపల్లి గ్రామానికి చెందిన పి.కిరణ్‌కుమార్(30) గురువారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పి.రాధ, వైస్ సర్పంచ్ నందగోపాల్, శ్రీనివాసుల రెడ్డి, సుధాకర్‌రెడ్డి, పురోషత్తం, వైస్ ఎంపీపీ ద్వారకనాథరెడ్డి, త్యాగ, సురేష్ పాల్గొన్నారు.

5వ వార్డుకు రెండు నామినేషన్లు

గుడిపాల: మండలంలోని పానాటూరు పంచాయతీ 5వ వార్డుకు సంబంధించి రెండు నామినేషన్లు వచ్చినట్లు ఎంపీడీవో రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. 5వ వార్డు మెంబర్ కాంచనకు అంగన్‌వాడీలో ఉద్యోగం రావడంతో ఆమె రాజీనామా చేశారు. ఈ స్థానానికి అలైక్య(35), సువిత(30) గురువారం నామినేషన్‌ను దాఖలు చేశారు.

పరిశుభ్రతతోనే అంటువ్యాధులు మాయం

- నగర మేయర్ అముద, డీఎంహెచ్‌ఓ ప్రభావతి దేవి
- ఘనంగా జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం



చిత్తూరు : విద్యార్థిని నోట్లో మాత్ర వేస్తున్న మేయర్ అముద, అధికారులు

చిత్తూరు రూరల్: పరిసరాల శుభ్రతతోపాటు వ్యక్తిగత శుభ్రత పాటిస్తే వ్యాధులు దరిచేరవని నగర మేయర్ అముద, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రభావతిదేవి, నగరపాలక కమిషనర్ అరుణ అన్నారు. చిత్తూరు గిరింపేటలోని మున్సిపల్ పాఠశాలలో గురువారం జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని నిర్వహించారు. పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. అనంతరం వారు చిన్నారులకు పౌష్టికాహార లోపం, రక్తహీనత, కడుపు నొప్పి, బలహీనత, వ్యాధి నిరోధక శక్తి తగ్గడం లాంటి లక్షణాలకు నులిపురుగులు కారణమవుతున్నాయన్నారు. చిన్నారుల కడుపులో తిష్ట వేసి ఆహార పోషకాలను గ్రహిస్తూ నెమ్మదిగా వృద్ధి చెందుతాయన్నారు. మెల్లగా రక్తంలోకి చేరి రక్తహీనతకు కారణమవుతున్నాయని చెప్పారు. వీటి నివారణకు ఏటా ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. 1–19 ఏళ్ల పిల్లల వరకు అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తోందన్నారు. ఈ నెల 17వ తేదీ వరకు అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, బడుల్లో పిల్లలకు మాత్రలిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే కో-ఆర్డినేటర్ సుదర్శన్, డీపీఎంఓ హర్షవర్ధన్, ఎపిడిమాలజిస్ట్ శ్రీవాణి, డీవైఈఓ చంద్రశేఖర్, కార్పొరేటర్ ఇందు పాల్గొన్నారు.

2,891 మందికి మాత్రలు

ఐరాల: చిన్నారుల్లో నులిపురుగుల నివారణకు అల్బెండజోల్ మాత్రలు తప్పనిసరి అని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాలలో గురువారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పిల్లల్లో నులిపురుగులను నియంత్రించడానికి, అడ్డుకోవడానికి అల్బెండజోల్ మాత్రలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. అనంతరం విద్యార్థుల చేత మాత్రలు మింగించారు. మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలు, అన్ని పాఠశాలల్లో 1 నుంచి 19 ఏళ్ల వయసున్న 2,891 మందికి మాత్రలు పంపిణీ చేశారు. ఎంఈఓలు రుషీంద్ర బాబు, దామోదర్‌నాయుడు, హెచ్‌ఎం కోమల, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గుడిపాల: నులిపురుగుల నివారణకు అల్బెండజోల్ మాత్రలను వేసుకోవాలని జెడ్పీ వైస్ చైర్మన్ రమ్య, స్థానిక సర్పంచ్ రజినీకాంత్ అన్నారు. నరహరిపేట జెడ్పీ హైస్కూల్‌లో గురువారం విద్యార్థులకు నులిపురుగుల మాత్రలను వారికి అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ హరి, ఎంపీడీవో రాజశేఖర్‌రెడ్డి, ఎంఈవో గణపతి, ఏఎన్‌ఎమ్ జబసెల్వి, ఎంఎల్‌హెచ్‌ఓ ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

నివారణ మాత్రల పంపిణీ

పూతలపట్టు: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఎంపీడీఓ గౌరి చేతుల మీదుగా విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు వైద్యాధికారులు మాత్రలను అందజేశారు. అనంతరం జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు ప్రియాంక, ప్రవీణ, ఎంఈఓ కృష్ణారెడ్డి, నాయకులు షణ్ముగం, హెల్త్ ఆఫీసర్ శ్రీనివాసమూర్తి, వైస్‌ఎంపీపీ ద్వారకనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

8,224 మందికి మాత్రలు

తవణంపల్లె: జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా మండలంలో 8,224 మంది విద్యార్థులకు ఆల్‌బెండజోల్ మాత్రలు అందించినట్లు వైద్యాధికారి ధాత్రేయచౌదరి తెలిపారు. తవణంపల్లె హైస్కూల్లో గురువారం ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్, ఎంఈఓ త్యాగరాజులు రెడ్డి, వైద్యాధికారులు డాక్టర్ ప్రియాంక, డాక్టర్ మోహన్ వేలు, హెచ్‌ఎం శ్రీరంజని చేతులు మీదుగా విద్యార్థులకు ఆల్‌బెండజోల్ మాత్రలను మింగించారు. తెల్లగుండ్లపల్లెలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ ధాత్రేయచౌదరి పాఠశాలలో విద్యార్థులకు మాత్రలు మింగించారు. వెంగంపల్లెలో డాక్టర్ వినయ్‌కుమార్ విద్యార్థులకు మాత్రలు మింగించారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ భారతి, హెల్త్ సూపర్‌వైజర్లు,ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.










గుడిపాల: మాత్రలను వేస్తున్న అధికారులు, పూతలపట్టు: మాత్రను విద్యార్థికి అందజేసిన ఎంపీడీఓ గౌరి, తవణంపల్లె: మాత్రలను మింగిస్తున్న ఎంపీడీఓ , ఐరాల: విద్యార్థులకు మాత్రలు వేస్తున్న డాక్టర్ పూర్ణలత

వరసిద్ధుని సేవలో ఎమ్మెల్సీ



కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని వైఎస్సార్ కడప ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ దర్శించుకున్నారు. ఆయన గురువారం కుటుంబ సభ్యులతో కలిసి దర్శనార్థం విచ్చేయగా ఆలయ ఇన్‌స్పెక్టర్ బాబు స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి, ఆశీర్వాద మండపంలో వేదపండితులచే ఆశీర్వచనం అందించి స్వామివారి తీర్థప్రసాదాలు, చిత్రపటం అందించారు.

పశువులకు టీకాలు



గుడిపాల: పాడిరైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని బొమ్మసముద్రం పశువైద్యాధికారి రవితేజ అన్నారు. బొమ్మసముద్రం హైస్కూల్ రోడ్డు ఆవరణలో గురువారం పశువులకు లంపీస్కిన్ వ్యాధి నివారణ టీకాలను ఉచితంగా వేశారు. ఆయన మాట్లాడుతూ మండలం తమిళనాడు సరిహద్దులో ఉండడం వల్ల గాలికుంటు వ్యాధి అధికంగా సోకే అవకాశం ఉందని పశువులకు జబ్బులు వచ్చినట్లయితే వెంటనే డాక్టర్లను సంప్రదించాలన్నారు.